నేటి దినపత్రిక
# సూర్య
తూర్పు గోదావరి
ఆదివారం,25 ఫిబ్రవరి 2018 8పేజీలు

# ఇంజనీరింగ్ కళాశాలలకు ఆదర్శంగా జెఎన్‌టియుకె






## - జాతీయస్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్-2కె18లో రెక్టార్

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** 72ఏళ్ల ఘన చరిత్ర కలిగిన జెఎన్‌టియు కళాశాల ఇతర కళాశాలలకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటుందని జెఎన్‌టియుకె రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం పేర్కొన్నారు. జెఎన్‌టియుకె ప్రాంగణంలో ఫిబ్రవరి 24, 25తేదీలలో ఈఈఈ, సివిల్ ఇంజనీరింగ్ మరియు ఈసిఈ విభాగాల వారు జాతీయస్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్-2కె18ను నిర్వహించుచున్నారు. ఈఈఈ ఫెస్ట్‌ను ఎన్‌కర్స్-18, సివిల్ ఇంజనీరింగ్ ఫెస్ట్‌ను సౌధ-18, ఈసిఈ ఫెస్ట్‌ను ఇ స్పార్క్-18గా వ్యవహరించుచున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం ది.24.02.2018న శనివారం ఉదయం 10.30 గంటలకు సెనేట్ హాలు నందు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం హాజరు కాగా గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొ.వివి.సుబ్బారావు, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు విచ్చేశారు. ఈఈఈ విభాగాధిపతి డా.టి.మురళీమోహన్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.ఎం.స్వరూపరాణి, ఈసిఈ విభాగాధిపతి ప్రొ.కె.పద్మప్రియ మరియు ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు డా.వివిఎన్.మూర్తి, ఎస్.షమీం భాను, డా.కె.రమాదేవిలు వేదికనలంకరించి జ్యోతిప్రజ్వలన గావించారు. ఈ నేపథ్యంలో రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం మాట్లాడుతూ నాణ్యతకు, విలువలకు, విధి విధానాలను అవలంభించడంలో తనకు తానే సాటని కీర్తించారు. విద్యార్థులు ఫెస్ట్‌లలో ఎక్కువగా పాల్గొని జ్ఞానసముపార్జన, నూతన సాంకేతిక పోకడల గురించి తెలుసుకుని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొ.వివి.సుబ్బారావు మాట్లాడుతూ సహజవనరులను ఉపయోగించుకుని దేశానికి ఉపయోగపడే పరిశోధనల వైపు దృష్టి సారించాలన్నారు. ఫెస్ట్‌లో పాల్గొనుటకు ముందుకు వచ్చిన వారందరూ విజేతలేనని, గెలుపు ఓటముల గురించి ఆలోచించక పాల్గొని నిపుణుల నుంచి సలహాలు, సూచనలు అందుకోవడంపై ఆసక్తి చూపాలని కోరారు. ఏ విషయమైనా మనస్సు పెట్టి ఆనందంతో నేర్చుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ ప్రొ.జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ టెక్ ఫెస్ట్‌లలో నేర్చుకున్న లేదా గ్రహించిన ఆధునిక సాంకేతికతను తమ తోటి స్నేహితులకు కూడా అందించాలన్నారు. సానుకూల దృక్పథంతో విద్యార్థులు ముందుకు సాగి తమ కలలను సాకారం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, ప్రోగ్రాం డైరెక్టర్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, స్టూడెంట్ కో-ఆర్డినేటర్లు, యుసిఇకె, అనుబంధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.